క్లుప్తంగా

నేడు బూరగాంలో సిరిమానోత్సవం



సిద్ధమైన సిరిమాను రథం, అంజలి రథం

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామంలో జరుగుతున్న జడ్డమ్మ తల్లి ఉత్స వాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సిరిమానోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. గ్రామంలోని పెద్దవీధి, బ్రాహ్మణ వీధిలో సిరిమాను రథం, అంజలి రథం, అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు.. అనుపోత్సవానికి వచ్చే భక్తులకు ప్రధాన రహదారికి అనుకున్న ఉన్న జడ్డమ్మ ఆలయానికి ఏదురుగా ఉన్న స్థలంలో వాహనాలకు పార్కింగ్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. సిరిమాను తిరిగే సమయంలో ట్రాఫిక్‌ను అదుపుచేసేందుకు పోలీసులు, గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. సిరిమాను రథం, అంజలి రథం, ఉయ్యాల స్తంభాలు సిద్ధం చేశారు. ఏడేళ్ల తరువాత పండగ జరుగుతుండటంతో ఆంధ్రా, ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు: శ్రీముఖలింగం క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ మాసం తొలి సోమవారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు విజయనగరం, విశాఖ, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి సేవలో తరించారు.

జాయినింగ్ ఉత్తర్వులు అందజేత



జాయినింగ్ ఉత్తర్వులు అందజేస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చిన 18 మంది ఉపాధ్యాయులకు జాయినింగ్ ఉత్తర్వులు అందజేసినట్లు ఎంఈఓ కె.రాంబాబు సోమవారం తెలిపారు. 6 యూపీ హైస్కూల్స్, 6 మోడల్ ప్రైమరీ స్కూల్స్, 6 ప్రైమరీ పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా వీరు జాయిన్ అయ్యారన్నారు. నూతనంగా మంజూరైన 6 మోడల్ ప్రైమరీ పాఠశాలలు కోరాడ, హిరమండలం, సుభలయ, కోరాడ కాలనీ, అవలంగి, తుంగతంపర కాలనీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, అభివృద్ధి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు.

కార్డెన్ సెర్చ్



ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

జలుమూరు: అనుమానిత వ్యక్తుల పట్ల కచ్చితమైన సమాచారం ఇవ్వాలని నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తిలారు రైల్వే స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. అనుమతి పత్రాలు లేని పది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిషధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

80 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హిరమండలం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 80 మంది గర్భిణులకు వైద్యాధికారి ఫరూక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు నిర్వహించారు. వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యులు పడాల సాయికుమార్, సీహెచ్‌ఓ రామారావు, పీహెచ్‌ఎన్ మోహిని, రోజారమణి, ఎల్‌టీ ఉషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకునే ప్రచారాలతో.. మోసపోవద్దు



- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- తడబడితే తప్పదు భారీ మూల్యం
- పాఠశాలల పూర్తి సమాచారం తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి

పాతపట్నం: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి విద్యాలయాల్లో చేర్పించేందుకు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే నూతన శాఖలను ప్రారంభించేందుకు పలు ప్రైవేట్ పాఠశాలలు సమాయత్తమవుతున్నాయి. భారీస్థాయిలో ప్రచారాలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆయా సంస్థలపై విద్యాశాఖ నియంత్రణ కొరవడడంతో అనుమతులున్న పాఠశాలలను గుర్తించడంలో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. కొత్త ప్రైవేట్ పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తప్పనిసరి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి పొందాలి. సీబీఎస్‌ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యా మండలి సమ్మతించాలి.

అవగాహన ఉంటేనే..

గతంలో మెళియాపుట్టి మండల కేంద్రంలో ఓ పాఠశాలలో తమకు అన్ని అనుమతులు ఉన్నాయని ప్రచారం చేసుకోవడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను ఆ విద్యా సంస్థలో చేర్చారు. ఫీజులు చెల్లించి, పుస్తకాలు సైతం తీసుకున్న తరువాత రెండు నెలలు నడిపించారు. విద్యాశాఖ రిజినల్ డైరెక్టర్, కేంద్ర విద్యా మండలి నుంచి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో జిల్లా విద్యాశాఖ ఆ సంస్థను మూసివేసింది. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు.

వీటిపై ఆరా తీయండి..

ప్రతీ విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొందాలి. చాలా విద్యా సంస్థల బోర్డులు, ప్రకటనలు పరిశీలిస్తే రిజిస్టర్డ్ అని ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు. విద్యాశాఖ నుంచి గుర్తింపు తప్పనిసరి. గుర్తింపు పొందిన విద్యా సంస్థలలోనే పిల్లలను చేర్పించాలి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇతర విద్యా సంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేట్ విద్యార్థిగానే పరిగణిస్తుంది. మరికొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు బ్రాంచ్‌ల పేరుతో పాఠశాలలను, కళాశాలలను నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచ్ ద్వారా పరీక్షలు రాయిస్తుంటాయి. ఇలాంటి విషయాలలో తల్లిదండ్రులు కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలి.

ఇలా అయితే ఇబ్బందే..

ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారిగా పేర్కొంటున్నారు. ఫలితంగా సమస్యల ఏర్పడతాయి.

తీసుకోవాల్సి జాగ్రత్తలు..

- తొలుత పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత సర్టిఫికెట్‌ను పరిశీలించాలి.
- మౌలిక వసతులు చూసుకోవాలి.
- మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు తప్పనిసరి.
- క్రీడా ప్రాంగణం, ఫిజికల్ ట్రైనర్ ఉన్నారా, లేదా తెలుసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి.
- ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ సామర్థ్య పరీక్ష పత్రం ఉందో, లేదో తెలుసుకోవాలి.
- సుశిక్షితుడైన డ్రైవర్ తప్పనిసరి.
- జీ-1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తిస్థాయి ఏర్పాట్లు ఉండాలి.

అనుమతులు తప్పసరి



ప్రతీ ఏడాది విద్యా సంవత్సరానికి ఆ విద్యా సంస్థ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. ప్రైవేట్ పాఠశాలలు ప్రతి సంవత్సరం విద్యాశాఖ, కమిషనర్ అనుమతులు పొందాలి. ఆయా పాఠశాలలు తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలి.

– సీహెచ్ తిరుమలరావు, ఎంఈఓ–2, పాతపట్నం

వైభవంగా మర్రిపోలేరమ్మ ఉత్సవాలు



కుంకుమపూజలు నిర్వహిస్తున్న మహిళలు



అలరించిన వేషధారణలు

మెళియాపుట్టి: మండల కేంద్రంలో మర్రిపోలేరమ్మ ఉత్సవాలు రెండో రోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. రాజా వీధిలోని అమ్మవారి విడిది వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆటపాటలు, వేషధారణలు, నృత్యాలతో అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించారు. మూడురోజులపాటు వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారంతో ఉత్సవాలు ముగుస్తాయి. గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు బాగా పడి పంటలు చక్కగా పండాలని మర్రిపోలేరమ్మను కోరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

తప్పిన ప్రమాదం



సన్‌షేడ్ పెచ్చులు ఊడిపడిన దృశ్యం

నరసన్నపేట: పంచాయతీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న గాంధీ బజారులో షాపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. షాపుల సన్‌షేడ్‌లు విరిగి పడుతున్నాయి. సోమవారం ఉదయం ఓ సన్‌షేడ్ విరిగి పడింది. ఆ సయమంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం బజారులో ఉన్న షాపుల్లో అద్దెకు ఉంటున్న వ్యాపారులు భయపడుతున్నారు. గతంలో కూడా స్లాబ్ పెచ్చులు ఊడాయని వ్యాపారులు అంటున్నారు. మొదటి అంతస్తులో ఉన్న షాపులు మరింతగా శిథిలమయ్యాయన్నారు. ఇలా ఎప్పటికప్పుడు పెచ్చులు ఊడుతున్నాయన్నారు. పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో..

- పెచ్చులూడిన పోలీస్ స్టేషన్ భవనం
- బిక్కు..బిక్కుమంటూ విధుల నిర్వహణ



ఫిర్యాదులు స్వీకరించే ప్రదేశంలో పెచ్చులూడిన దృశ్యం




శిథిలావస్థలో మెళియాపుట్టి పోలీస్ స్టేషన్


మెళియాపుట్టి: దశాబ్దాల క్రితం నిర్మించిన మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి చాలా ఏళ్లు కావడంతో పైకప్పు పెచ్చులూడుతోంది. 1987 నవంబర్ 16న భవనం నిర్మించారు. సుమారు 38 ఏళ్లు కావడంతో భవనం ఎప్పుడు కూలిపోతుందోనని విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి భయం పట్టుకుంది. ప్రతీ సంవత్సరం వర్షాల కాలం వస్తే స్టేషన్ అంతా నీరు కారుతుంది. వర్షాలుపడే సమయంలో స్టేషన్లో ఉండటానికి కూడా భయపడుతున్నట్లు పలువురు సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల సావిత్రి అనే మహిళా కానిస్టేబుల్ రిసెప్షన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో పైకప్పు పెచ్చులూడి తలపై పడి గాయాల పాలైంది. ప్రజలకు నిత్యం రక్షణ కల్పించే రక్షకభటులకు రక్షణ కరువైన పరిస్థితుల్లో మెళియాపుట్టి పోలీసులు ఉన్నారు. గతంలో మెళియాపుట్టిలో నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ ఆ నిధులతో కొత్తూరులో సర్కిల్ కార్యాలయం నిర్మించారు. ప్రస్తుతానికి ఎటువంటి నూతన భవనం నిర్మాణానికి అంచనా కూడా లేదు.

క్వార్టర్స్ పరిస్థితి అంతే..

పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న వారికి కుటుంబాలతో సహా ఉండటానికి 12 క్వార్టర్స్ సైతం ఉన్నాయి. అవికూడా శిథిలావస్థకు చేరి, వర్షంనీరు కారుతున్నాయి. పోలీసులు కుటుంబాలతో చాపర, మెళియాపుట్టి, పాతపట్నంలో అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. పోలీస్ క్వార్టర్స్ సమీపంలో పగలు, రాత్రీ తేడాలేకుండా పాములు సంచరిస్తున్నాయి. నూతన భవనం నిర్మిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని సిబ్బంది చెబుతున్నారు.



రైటర్ కూర్చునే ప్రదేశంలో పెచ్చులూడిన దృశ్యం



కంప్యూటర్ రూమ్‌లో ఊడిన పెచ్చులు



శిథిలావస్థలో పోలీస్ స్టేషన్ క్వార్టర్స్

ఎమ్మార్సీకి చేరిన యూనిఫాం



యూనిఫాంను పరిశీలిస్తున్న ఎంఈఓ రమణ

సారవకోట: ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించేందుకు యూనిఫాం ఎమ్మార్సీకి చేరినట్లు ఎంఈఓ ఎం.వి.రమణ సోమవారం తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి మూడు జతల యూనిఫాం అందిస్తామన్నారు. వాటిని ఆయా పాఠశాలలకు పంపించనున్నట్లు తెలిపారు.

ప్రణాళికలు అమలు చేయాలి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు అమలు చేయడానికి మండల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐదు మండలాల అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. తొలుత సీఎం చంద్రబాబు నిర్వహించిన విజన్ 2047 టెలికాన్ఫిరెన్స్‌లో ఎమ్మెల్యే, జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, ఐదు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

రూ.10 వేల విరాళం అందజేత



తాతబాబుకు విరాళాన్ని అందజేస్తున్న వెంకటరమణ దంపతులు

కొత్తూరు: కొత్తూరులోని సీతారామ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని భామిని మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన సకలాభక్తుల వెంకటరమణ, స్వర్ణమాల దంపతులు రూ.పది వేలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు లోతుగెడ్డ తాతబాబు నాయుడుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ దంపతులకు కమిటీ సభ్యులు సత్కరించారు. కమిటీ సభ్యులు జానకిరామయ్య, యతిరాజు, పాగిరి రవి, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక ఆదాయం



మాట్లాడుతున్న అనందిత పాల్

నరసన్నపేట: సాగులో మెలకువలు పాటించి పంటలు పండిస్తే మంచి ఆదాయం వస్తుందని భారతీయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త ఆనందిత పాల్ అన్నారు. మండలంలోని కోమర్తిలో సోమవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. మెట్ట ప్రాంతాల్లో ఉద్యానవన పంటలు వేయడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలసకు చెందిన శాస్త్రవేత్త వి.హరికుమార్ మాట్లాడారు. వరితో పాటు ఇతర పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. శాస్త్రవేత్తలు స్వాతి, కోటేశ్వరరావు, సర్పంచ్ చిన్నమ్ముడు, వీపీఏ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలున్నా.. పట్టించుకోరా?



ఈ చిత్రం హిరమండలం మండలంలోని మర్రిగూడ రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం. ప్రతీ సచివాలయం పరిధిలో రైతు సేవా కేంద్రాలున్నాయి. వీటిలో కియోస్క్ యంత్రాలు గత ప్రభుత్వ హయాంలో అమర్చి వీటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించి వినియోగించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఈ యంత్రాలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఇవి మూలకు చేరాయి. వీటిని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

– హిరమండలం

మురుగునీటి మధ్యలో కుళాయి..



సారవకోట మండలంలోని కిడిమి పంచాయతీ భద్రాచలంలో మంచినీటి బావి చుట్టూ మురుగునీరు నిల్వ ఉంటుంది. బావికి ఆనుకుని ఉన్న మురుగు నీటి కాలువ పూర్తిగా పూడికలతో నిండిపోయింది. బావికి పక్కనే తాగు నీటి కుళాయి చుట్టూ మురుగునీరు చేరింది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సచివాలయ సిబ్బంది కనీసం గ్రామానికి రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

– సారవకోట

సాక్షి కార్యాలయంపై దాడి హేయం



మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: సాక్షి ఆఫీసును టీడీపీ నేతలు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని, కూటమి నేతల ప్రజావ్యతిరేక విధానాలు పత్రికల్లో రాకుండా ఉండేందుకే ఇటువంటి దాడులకు దిగుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్టూరులో విలేకరులతో మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమనిన్నారు. సాక్షి టీవీలో డిబేట్ నిర్వహిస్తుండగా కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను శ్రీనివాసరావును బాధ్యులను చేయడం తగదన్నారు. గతంలో 30 వేల మంది మహిళలను ఇతర ప్రాంతాలకు తరలించారని, భర్తలు లేని సమయంలో ఇంట్లోకి వలంటీర్లు వెళ్తున్నారని కూటమి నేతలు మహిళలను అగౌరపరిచేలా వ్యాఖ్యలు చేసినప్పుడు ఈ చట్టాలు ఏమయ్యాయన్నారు. సర్పంచ్ యర్లంకి ధర్మారావు, తమ్మినాయుడు, శంకరరావు ఉన్నారు.

చింతాడకు సత్కారం



సూర్యనారాయణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొత్తూరు: ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన దాత, వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీలో నిర్మించిన ఉమా కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 వేల నగదు, 50 సిమెంట్ బస్తాలతోపాటు ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన అన్నప్రసాదానికి బియ్యాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

కొత్తూరు: రాయితీపై వరి విత్తనాలను కొత్తూరు ఏఓ స్వర్ణలత, సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైస్ ఎంపీపీ తలసీవరప్రసాదరావు సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఏపీ సీడ్స్ అందజేస్తున్న నాణ్యమైన విత్తనాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి సాగు చేయడం మంచిదన్నారు. రైతులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

53 మందికి నోటీసులు



మాట్లాడుతున్న ఈఓ ద్రాక్షాయిని

నరసన్నపేట: మండల కేంద్రంలోని చెరువు గర్భాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ దృష్టికి హైదరాబాద్‌కు చెందిన గరిబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ తీసుకువెళ్లింది. ఈ మేరకు న్యాయవాది డి.వి.రావు ఎన్‌జీటీలో పిటీషన్ వేశారు. దీంతో పట్టణంలోని జలగల, రాతికర్ర చెరువుల ఆక్రమణదారులకు నోటీసులు జారీ అయ్యాయి. శనివారం ఆర్డీఓ సాయి ప్రత్యూష, సర్వే డిపార్టమెంట్ ఏడీ కె.రమేష్, ఆర్డీఓ కార్యాలయం డీఐఓఎస్ వెంకటేశ్వరరావుతో కూడిన బృందం పరిశీలించిన విషయం విదితమే. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి వారినుంచి వివరణ తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి ఆర్డీఓ ఆదేశించారు. దీంతో పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని ఈ రెండు చెరువుల్లోని ఆక్రమణదారులు 53 మందికి నోటీసులు ఇచ్చారు. వీరందరూ సోమవారం పంచాయతీ కార్యాలయానికి వచ్చి వివరణ ఇచ్చారు. వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు చూపారు. ఆక్రమణలు చేయలేదని అందరూ రాత పూర్వకంగా ఈఓకు తెలియజేశారు. రాతికర్ర చెరువు ఆక్రమణలకు సంబంధించి 29 మందికి, జలగల చెరువుకు సంబంధించి 24 మందికి నోటీసులు ఇచ్చామని, వారి నుంచి వివరణ తీసుకుంటున్నామని ఈఓ ద్రాక్షాయిని తెలిపారు. ఈ చెరువుల సమీపంలో నిర్మాణాలు చేపట్టిన పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ విధంగా తమకు ఆందోళన కలిగించడం సరైంది కాదని అంటున్నారు. న్యాయం చేయాలని కోరుతున్నారు.